# వ్యాధిగ్రస్తులు



"ఔషధం జాహ్నవీతోయం। వ్యాధిగ్రస్తే కళేబరే। వైద్యోనారాయణో హరిః॥" గుర్తు చేసుకుంటూ చదివి మందు తాగించాడు తండ్రి శివానందం. కూతురు జానకి చేదు మింగింది. తండ్రి తన పనిమీద వెళ్లాడు. జానకి పక్కమీదికి వొరిగింది. శివానందం హైయ్యర్ యెలిమెంటరీ స్కూలు నడుపుతున్నాడు. ఆయన మేనమామ గౌరీనాథం స్థాపించాడా స్కూలుని. ఒక్కగానొక్క కొడుకు జాండిస్ వచ్చి పోతే ఆ చిన్నవాని పేర బడిపెట్టాడా తండ్రి. శివానందం కౌమారావస్థలోకి నడిచి యేటికెదురీదుతున్నాడు. ఈ చివరి కూతురు జానకికి పెళ్లి చేయాలి. సంబంధాలు చెట్టెక్కి కూచుని నవ్వుతున్నాయి. గ్రాంట్లు గౌరీనాథం గుంజుకొస్తాడు. శివానందం సంఖ్యాబలం చూపాలి. పిల్లల తల్లిదండ్రులతో మైత్రి నెరపుతూ, లౌక్యంగా పైసంపాదన కళ్లచూస్తున్నాడు. ఆయుర్వేద వైద్యం, హోమియో వైద్యం చేస్తూ చిన్న చిన్న రోగాలు కుదిర్చి, పిత్రార్జితం కాపాడుకుంటూ, కార్యకరామతులకు అప్పుతేకుండా నెట్టుకొచ్చి సనాతనిస్టని పేరు పొందాడు. పిల్లల్ని హైస్కూళ్లోకి పంపగల శక్తి వున్నది. అందుకని పనిబడినవారు వైద్యం గూడా చేయించుకుంటారు.

బ్రహ్మానందం ప్లీడరు గుమాస్తా. దూరపు బంధువు. బావ అవుతాడు. ఆదివారం కావటం మూలాన, శివానందాన్ని సంప్రదించి, సంబంధం స్థిరపరచుకోవాలని వచ్చాడు.

"యేమంటారు బావగారూ? మా అబ్బాయి జీవనందాన్ని పంపాను. చూశారుగా. నిదానంగా అడిగిన వాటి కన్నిటికీ సమాధానమివ్వమని చెప్పి పంపాను. దివ్యమైన సంబంధం వచ్చింది జీవునికి. మిమ్మల్ని కలిశాక నిశ్చయించాలని వచ్చాను. పెళ్లివారికి పిల్లవాడన్నివిధాలా నచ్చాడు. స్థిరపరచమని తొందరపడుతున్నారు. మీరు జాతకం గూడా చూడగలరని మన మిత్రుడు శంకరానందం చెప్పాడు. చూతామని పిల్లవాని జన్మపత్రిక వెతికి తెచ్చాను" చొక్కా

జేబు నుంచి కాగితాల కట్టతీసి జన్మపత్రిక తీసి ముందుంచాడు బ్రహ్మానందం.

పైరుగాలి తిరిగింది. కొబ్బరాకులు వూగుతూ గాలి సరఫరా చేస్తున్నాయి. ఇంకా చీకటి పడలేదు.

''అబ్బాయికి జబ్బేమీ లేదు బావగారూ. నాకు తీరిక లేదు. జన్మ పత్రిక సాయంతో జాతకం చెప్పగల మిత్రుడున్నాడు. వానికిస్తే నొప్పి కలక్కుండా చెప్పి ఆనందం కలిగిస్తాడు''.

బ్రహ్మానందం శివానందం మొహం పరిశీలించాడు.

''మీరేదో దాస్తున్నారు, బావగారూ మొహమాటమేమో నిజం చెప్పటానికి. భరించగలను. యెలాగో కోర్టు పనిమీద పట్నం వెళ్లాలి. అబ్బాయిని వెంటపెట్టుకెళ్లి స్పెషలిస్టుకి చూపుతా. కట్నం పోసి తెచ్చిన అల్లుడు అల్లర్లలో దివికేగిన నాడే నా గుండె బండ అయింది. అబ్బాయి తల్లితో వేగటం లేదూ? ఇదీ అంతే. వైద్యం చేయమని అనలేదే. ఫరవాలేదు. చెప్పేయండి''.

బావ బ్రహ్మానందం సరస హృదయం తెలిసినవాడే శివానందం. ''అబ్బాయి జీవానందానికి నిజంగా జబ్బేమీ లేదు. అసలు ప్రవృత్తి అంతే. చేయి జాపితే చూశాగా. దీర్ఘాయుష్మంతుడు. మకురుతనం అంటారు. అట్టి స్వభావాన్ని. మోటుగా చెప్తే రణపెంకె. మకురుతనానికి మందులేదు. మీ శక్తిమేరకు వానితో వేగటమే మందు'' అన్నాడు శివానందం.

''సరే కర్మ బాగున్నది. జన్మ పత్రిక చూడరూ?''

''చెప్పానే మిత్రుడున్నాడని. వాడికీ పత్రిక పోస్టు ద్వారా పంపచ్చు జవాబు పోస్టుద్వారా వస్తుంది. ఇబ్బంది వుండదు. యేం తీసుకోడు'' అని నవ్వుతున్నాడు శివానందం.

''మీరంటే నాకెంతో గౌరవం. నిండా మునిగిన వానికి చలేమిటి'' కంఠ స్వరంలో విషాదం కలిసింది.

''మీ యిష్టం'' అంటూ జన్మపత్రిక చూస్తూ వేరే కాగితం మీద లెక్కలు

వేస్తూ, రాసులూ, గళ్లూ, కోణాలూ, గోచారం, దోషాలూ గ్రహశాంతి చేయాలా అనేవి ఆలోచిస్తూ చెప్పుకెళ్లాడు శివానందం. ''అబ్బాయికి వయస్సు వచ్చేకొద్దీ, ఆస్తి అమ్మటం, అయినకాడికి చరాస్తి తక్కువ ధరకి అమ్మేయటం యిష్టం. పీకల మీదికి వ్యవహారం యెక్కితే వేలం వేయిస్తాడు. యెవరూ తిట్టే అవకాశమీయకుండా హిమాలయ శ్రేణి మీదికి ట్రెక్కింగ్ చేస్తాడు. కాని మళ్లా దర్శనమిస్తాడు''.

బ్రహ్మానందం అవాక్కైనాడు. బావ శివానందం వీధి గుమ్మంవేపు చూస్తుంటే తానూ అటే దృష్టి సారించాడు.

ఒకపూర్వసువాసిని, విరాగిలాగా అభినయిస్తూ, ముసుగు పీక్కుంటూ, ముక్కు నలుపుకుంటూ, అంతలోనే చేతులు వెనక్కి పెట్టి కలిపి, చూరు వంక చూస్తూ వచ్చింది.

వీళ్లిద్దరూ వరండాలో చాపమీదున్నారు. మెట్ల కింద నిలబడి ధాష్టీకంగా అడిగింది. ''యేం చేశావు నా వ్యవహారం శివానందం? నీ చుట్టూ ప్రదక్షిణాలు చేయటమేనా నా పనీ? పని నెరవేరుతుందో లేదో గూడా సూచనగా నన్నా చెప్పవే? మరో వ్యవహారం ఆపివస్తుంటిని''

''రానవసరం లేదని చెప్పాను. పుత్రవుడియంగా, వడ్డీ పేరెత్తకుండా, ప్రోనోటన్నా వ్రాయకుండా, తొంభై వేలు చేబదులెవరిస్తారు? తీరుస్తారని భరోసా నేనివ్వాలా? హామీ వుండాలా? కుప్పలు కొట్టించి యిస్తానంటారు గానీ, మీది శుక యోగి మనస్తత్త్వం. మిమ్మల్ని పట్టుకోటమెలాగో తెలియదు'' అన్నాడు శివానందం. లోపలికి పొండి అనలేదు.

యెద్దేవా, వెక్కిరింతా వినిపించి ఛర్రున కత్తి దూసింది పూర్వసువాసిని. కనులెర్రజేసి, దుర్భాషలాడి చేతులు తిప్పింది. అంతటితో వెళ్లిపోక మెట్లెక్కి లోపలికెళ్లి, వంటింట్లోకి తలదూర్చి అరిచింది. ''హనీవీ! నా కోసం వుడకేయకు రొట్టె వేయకు. మీ ఆయన మొండి చెయ్యి బైటబెట్టాడు. తినటానికి పిండం లేక రాలేదు నేను. నువ్వెంత చేసు, నీ మగడెంత జేసు. యేం వుద్యోగం

వెలిగిస్తున్నాడు? కలెక్టరా? కలెక్టరమ్మ మొగుడా? కర్మ గాడిదలు తోలమంటే కోరికలు కోటలేలుదామంటున్నాయట'' అని దండకం చదివింది.

''మజ్జిగ తాగు పిన్నీ. నడిచి వచ్చినట్టున్నావు'' అన్నది హనుమాయమ్మ, , శివానందం భార్య. వెండి గ్లాసులో మజ్జిగ పోసి ముందుంచింది ''నిమ్మ చెక్క పిండి, వుప్పు సొంటి పొడి చల్లాను. మెల్లిగా అందిస్తారు నీ వడిగినది'' అంటున్నది హనివి.

'' ఈ దొంగ మర్యాదలకేంలే. నోరు నవ్వుతుంటే నొసలు వెక్కిరిస్తున్నట్టున్నది నీ సాకారం'' కోపం పట్టలేక గ్లాసందుకుని విసిరింది. దానిలోని మజ్జిగ కిటికీ చువ్వలగుండా పోయి మెంతి పాదుమీద పడింది. గ్లాసు చువ్వకి తాకి కిందపడింది. చరచరా వరండాలో కొచ్చి మెట్లు దిగుతూ గొణిగింది.

''ఛూ. చస్తే రాను. ఇప్పించగలిగే లేదంటున్నాడు భటాచోర్. పారిపోతానా? దేశాంతరం పోతానా? నమ్మలేడూ'' అని వీధి తలుపు ధన్ మని చప్పుడు చేస్తూ మూసి వెళ్లింది.

''పిచ్చి మనిషా? అంత దుడుకా?'' అడిగాడు బ్రహ్మానందం.

''కాదు. హైపర్ టెన్షన్ రక్తపోటూ పీడిస్తున్నాయామెను''.

''ఔషధం పుచ్చుకుని కంట్రోల్ చేసుకోమని చెప్పాను మంచిమాట చెవిలో కెక్కదు. అది మరో వ్యాధి. మళ్లా వస్తుంది'' అంటున్నాడు శివానందం.

దొడ్డివేపు నించి తలుపునెట్టుకుని సూర్యంలోపలికొచ్చి యింటి చుట్టూ తిరిగి వచ్చి బావ శివానందాన్ని చూస్తూ నిలబడ్డాడు. గూడెగరేస్తూ వుంటాడు కళ్లార్పుతూ వుంటాడు. మంచి తెలుపు. శరీర సౌష్టవం. ఆరోగ్యం నల్లని క్రాపు. చొక్కా లేదు. చినిగి మాసిన వుత్తరీయం. మాసిన ధోవతి.

పొద్దూకిందని హనుమాయమ్మ లైటు వేసింది. కరెంటు పీకేస్తాడేమోనని, వెలిగించిన లాంతరు దీపం చిన్నది చేసి తెచ్చి వరండాలో గోడవారగా వుంచి వెళ్లింది.

''బావా! నీ స్కౌండ్రల్ ఫ్రెండ్ పిల్లనిస్తా రమ్మని, కట్నం పేరెత్తక నేర్పుగా తన పెంకె కూతుర్ని నా కంటగట్టాలని చూచాడు. నేనేనా దద్దమ్మను? పెంకి పిల్లకు మొండి మొగుడే తగినవాడని పినతండ్రి కొడుకు తమ్ముడు రమణను తెచ్చి, '' యీ మొండివాడు నీ పెంకిపిల్లకి తగినవాడు. వీని కంటగట్టు'' అని తప్పించుకొచ్చాను. అర్జంటుగా టు థౌజండ్ రుపీస్ కావాలి. మా పెద్దన్న కొడుకు సీతాపతి మీద పాపర్ దావా వేసి, వాడు రాయించుకున్న మాగాని భూమి నాలుగెకరాలూ నావి నాకు చెందేట్టు చేస్తా. మా అమ్మే పెంచింది''.

''లేదు. మేష్టర్లకి జీతాలివ్వాలి. పన్ను కట్టాలి. ధరలు పెంచారు గదూ సర్కారు వారూ? ఖర్చులు పెరిగాయి. రాబడి సన్నగిల్లింది'' అన్నాడు శివానందం.

''దొంగ నవ్వ్వా నీవూ! శూన్య హస్తం చూపితే పోతానా? పోనీ టు ఫిఫ్టీ నా చేత పెట్టు ఇప్పుడే పోతా. అక్క అసలే రాల్చదు'' అని నవ్వుతున్నాడు.

''అదీ లేదు. యీ నెల యింటి సరుకులు అప్పు పెట్టే తెచ్చాను. నువ్వు కో ఆపరేటివ్ స్టోర్స్ కెళ్లి నా పద్దు పుస్తకం చూపమను''.

''మహా పీనాసీ! అవసరానికడిగితే యివ్వవు. మోసం చేసే లాగాలి నీ దగ్గర్నుంచి. నీ మేనల్లుడు మోసగించే నీ రెండు వేలూ కాజేశాడు. యిచ్చావా లేదా? వాడు వస్తుందన్న జాబ్ వాడికి రానే లేదు. మరోడు తన్నుకు పోయాడు. వాడు నీ కూతురుకి స్థిరపరచిన సంబంధం పాడైంది. వారికి చిల్లి గవ్వ లేదని తెలిసింది నీకు. మళ్లా వస్తా. నిజాయితీకి విలువ లేదీ రోజుల్లో'' అంటూ వెళ్లిపోయాడు.

''బావమరిదే! బావనే! తిట్లు ఆశువుగా వస్తాయా వల్లె వేస్తాడా? మిన్న కున్నావేం అంటించక'' అనడిగాడు బ్రహ్మానందం.

''లేదు. దేహ ధారుడ్యమూ తెలివితేటలూ వున్నాయి బావమరిది శీతల్‌కి. లేనిదల్లా బుద్ధే. శీతల్ మార్చి ఛీట్ అని పేరు పెట్టారు బందుగులూ మిత్రులూ. అంటించేకన్నా నేర్పుగా వదిలించుకోటమే మేలు. సిగ్గు లేని నవ్వు నవ్వుతాడు

అదొక వ్యాధి''.

''వ్యాధే!?'' అని నోరు వెళ్లబెట్టాడు బ్రహ్మానందం.

'' ఆ. ఆ.''

''దానికీ మందు లేదా?''

''వున్నది. కంటకే నైవ కంటకమ్. పుటె థీఫ్ టు కాచె థీఫ్. అతను చేసే మోసం కన్న మిన్న అయిన మోసం చేస్తే లాభం లేదని వెళ్లిపోతాడు బలాదూర్ తిరగటం, దూబరా యిష్టం. డబ్బు అందని నాడు కొంత వుపశమిస్తుందా వ్యాధి. ఒకరిద్దరూ వైద్యం చేసి వుపశమింప చేస్తారు'' అన్నాడు శివానందం.

ఎవరో అమ్మాయి రావటం కంటబడింది యిద్దరికీ. అంతలోనే కరెంటు పోయింది. లాంతరు దీపం గుడ్డి వెలుగులో ఆ వచ్చేది సుందరేనని తేలింది. యెఱ్ఱని యెరుపు. ''బాబాయ్! నా పేర బాంకులో ఇరవై వేలు వేయనిదీ నేనింక స్టడీస్ కంటిన్యూ చేయను. బాగా ఆలోచించుకో. చింకి గుడ్డలతో కాలేజీకి రావద్దని మా ప్రొఫెసరు రోజూ తిడుతుంది. నువేమో డబ్బు ఇవ్వవు. నీదా ఆ డబ్బు మా నాన్నది. నువ్వెక్కడ దొరికావాయనకు? నాకు గార్డియన్‌గా నీవే కనపడాలా? మెస్ ఛార్జెస్ పెరిగినై. యెలిమెంటరీ స్కూల్ కాదది. వైద్య కళాశాల. నీ మనుమరాల్ని నేను కనిబెట్టి చూడాలా? చదువుతున్న దా బోయ్ ఫ్రెండ్సుతో తిరుగుతున్నదా నీకు వ్రాయాలా? దానికి నేనంటే లెక్కలేదు. చెప్పలేదనేవు. వార్నింగిస్తున్నా. చదువు వదిలేసి పోతా. నువే సంబంధాలు చూడాలి. నా సహాధ్యాయి పిలుస్తున్నాడు. వేరే వర్ణమైతేనేం పీనాసి గాదు. వచ్చే నెల నించి నా డబ్బు నేనే డ్రా చేసి తెచ్చుకోవాలి'' అని వురిమి పిడుగులు పడేసి గిరుక్కున తిరిగి అదృశ్యమైంది సుందరి. వీధి గుమ్మం దాటుతూ మరో గర్జన చేసింది. ''యింకా పిల్లల్ని కంటున్నావా జానకికి పదేళ్లు వెళ్లలేదూ నేను కొంగ జపం చేస్తూ వైద్యం పూర్తిచేయాలా?''

శివానందం లాంతరు తెచ్చి దీపం పెద్దది చేశాడు.

''అదీ జబ్బేనంటారా మీరు? బావగారూ? పిన్నా పెద్దా తారతమ్యం

లేకుండా గర్జించిందే'' అని విస్తుపోయాడు బ్రహ్మానందం.

'' ఆ. జబ్బే'' అన్నాడు నిదానంగా

''అంత ధాష్టీకమా? వెరపు యెరుగదేమో. దాని పేరేమిటి?''

'' ఆ జబ్బు పేరు డబ్బు జబ్బు''

'పెద్దన్న కారు ప్రమాదంలో పోయాడు. వదిన జాండిస్ వచ్చి అంతకు ఒక నెల ముందుపోయింది. అన్న హాస్పిటల్లో వుండగా చూపులన్నా అందాలని వెళ్లాను. వీలునామా వ్రాయించానని చెప్పాడన్న. కొనవూపిరితో వున్నాడు. సుందరి మెడిసిన్‌లో చేరిందని చెప్పాడు. కొత్తకారు కొనియాడాదే అయింది. తానే తోలుతున్నాడు లైసెన్సు తెచ్చుకున్నాడు. ఆర్‌టిసి బస్ ఢీకొన్నది. వాన. దోవ తిన్నగా లేదట. ఆర్‌టిసి డ్రైవర్ తప్పులేదని వాగ్మూలమిచ్చాడు. తానే యెడ్లబండికి కుడిపక్కగా తప్పించి వెళ్లిపోవాలని కారు పక్కకి పోనివ్వగా బస్ తాకిందన్నాడు. రాత్రి యేడున్నర.

వీలునామాలో ఆస్తి కాపాడి, పిల్ల చదువు పూర్తికాగానే పెళ్లి చేసి తన స్వార్జితం కూతురుకి చెందేట్టు చేయాలని వ్రాశాడు. పిత్రార్జితం యెకరం పొలం నాకు చెందేట్టు వ్రాయించాడు అన్న. సుందరేమో రెండు చేతులా ఖర్చు చేస్తుంది. స్నేహాలు. గొప్పలకి పోతుంది. కట్నం పొయ్యాలిగా. సారె యివ్వాలి. ఆస్తి కాపాడి యిచ్చేయాలి. యేవీ తప్పవు.'' అంటున్నాడు శివానందం.

లోపల్నించి హనుమాయమ్మ అరిచింది ''స్నేహితుడొస్తే పరవశత్త్వం పొందుతాడు యింటి మనిషి. మన వెనక వీధిలో శారదకు నెప్పులొస్తున్నాయిటండీ దొరగారూ! సాయం రమ్మని కొడుకుని తోలింది నా నెత్తి మీదికి. మంత్రసాని వచ్చేసిందట. పిచ్చి వెధవకు అయిదో యేడు. టైము చూశారా? చిన్న సన్యాసి చుట్టూ తిరిగి వచ్చాడు. నేను మింగటమైంది. నేను సన్యాసితో పోతున్నా. తెల్లారేదాకా వుండాల్సి వస్తుందేమో. శారద తల్లి వూడిపడలేదుట. కార్డు ముక్క పారేసిందిట శారద. అది అందలేదేమో తల్లిముండకు'' సంచీలో గుడ్డలు కూరి, పిల్లాడి చేయి పట్టుకుని వీరిద్దరి పక్కగా

వెళ్లి వీధి గుమ్మం దాటింది'' పిల్లకు నిమ్మళించిందేమో. జావ పొయ్యండి'' అని వెనక్కు తిరిగి అరిచి వెళ్లింది.

'' ఆమె రాదులే యివాళ్టికి. రికార్డు వింటావా? భోజనం కానిద్దామా?'' అన్నాడు శివానందం లేస్తూ బ్రహ్మానందం లేస్తూ హాలులోని గోడ గడియారం వంక చూశాడు. లైట్లు వెలిగినై. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. చిన్న ముల్లు పదకొండు మీదా పెద్దముల్లు పన్నెండు మీదా వున్నాయి. టిక్ టిక్‌మని చప్పుడు.

''రోజుకోసారి గొంతు చించుకోనిదీ నా యిల్లాలికి పొద్దుబోదులే. యేమనుకోకు. మనం టైం చూసుకోలేదు''.

''నే వెళ్తానిహ'' వుత్తరీయం అందుకున్నాడు బ్రహ్మానందం.

''వెళ్లకు యివాళ సుదినం. ప్రయాణమై వెళ్లిపోలేదు భార్యామణి. వెనకింటికి వెళ్లింది. అలా తిరిగే కాలు స్థిరంగా వుండదు. పందెం వేసి గెలవచ్చు. ఆ జబ్బు నయంగాదు'' నవ్వుతూ లోపలికి దారితీశాడు శివానందం. ''స్నానం చేయాలా? తలుపు మూసి రా'' అన్నాడు.

''స్నానమక్కర్లేదు గానీ, మళ్లా వండాలేమో. పోనిద్దురూ నన్ను''.

''వద్దు. వున్నదే చెరిసగం తిందాం. సోక్రటీసు పెళ్లాం యిలాగే అరిచేదిట. ఓనాడు పట్టలేక నెత్తిన నీళ్లు కుమ్మరించిందట. '' ఇవాళ వురుములు లేవు. ఒట్టి వానే'' అన్నాడట సోక్రటీసు. ఉట్టి మీద అరిశలున్నాయి. జానకి కోసం నాన్ రొట్టె పెద్దది తెచ్చాను. కంది పచ్చడీ వెన్నా పూసి తిందాం. జానకి చేత జావ తాగించి వస్తా ''అమ్మా జానీ పాయసం తాగమ్మా జ్వరం జారింది. పండు తింటావా?'' జానకిని కూచోబెట్టే ధారకం పోసి, చేతులూ మొహమూ తడిగుడ్డతో తుడిచి, పొడితువాలా యిచ్చి పడుకోబెట్టి వచ్చాడు తండ్రి.

''రా. యే పాటు తప్పినా సాపాటు తప్పదు బ్రహ్మానందం''.

''యేదో రికార్డు వినమంటిరే'' అన్నాడు బ్రహ్మానందం.

''కూచోండి. అన్నీ అమర్చి ఆన్ చేసి వస్తా'' తిండి కన్నీ అమర్చాడు శివానందం.

''మీదేనా?'' తానూ తిండి ముందు కూచుని అడిగాడు.

''కాదు. నా మిత్రుడు ఆరువారాలు కొడుకు దగ్గరుండి వస్తానని అమెరికా వెళ్తూ యిదిక్కడుంచి వాడుకుంటూ వుండమని వాడుకోటం నేర్పి వెళ్లాడు'' అలా అంటూనే వెళ్లి ఆన్ చేసి వచ్చాడు.

''యేమిటేశామా? కూరలమ్ముకునే వాళ్లల్లే యెంతసేపు కూరల గురించి మాట్లాడుతారూ? మరో టాపిక్ రాదా? వూరగాయలు మార్కెట్ రన్ చేస్తారాయేంవేం. ఇంటింటికీ తిరిగి అమ్ముతారా. వీధిలో కేకలేస్తూ బండినెట్టుకుంటూ వెళ్తారా? బండీకి గంట కడతారా ఊరాగాయలోయ్ అని అరుస్తుందా కావుమ్మ. బట్టి గొంతు దానిది. అది నడుస్తుంటే మేకచీర కట్టుకుని నడుస్తున్నట్టుంటుంది. పట్టుచీర లెందుకే కోతికీ. కాకిముక్కులాగా వుంటుంది. నీ స్నేహితురాలు జానమ్మ జామకాయ లాగా వుంటుంది దాని మొహం. ఆ పాంజేబులేం బాగున్నాయే సోదెమ్మాంబకూ. గుఱ్ఱం కాళ్లకి గజ్జెలు కట్టినట్టున్నాయి. గుఱ్ఱంలాగే పరుగెత్తుతుంది. ఇవాళ మామ్మ కుక్కలాగా మొరగటం లేదేం. కాట్లకుక్కలల్లే అత్తాకోడలు కొట్టాకోరా యివాళ. అదేపనిగా ఛాటర్ బాక్స్‌లాగా వాగేపక్కింటబ్బాయి యేమైనాడూ సీసాకి బిరడా పెట్టినట్టు మూతీ వాడూ యెటుపోయాడూ? వాళ్లనాన్న ఓంద్రపెడుతున్నాడా? అదే వినబడుతున్నది. అవధానీ ఆవకాయా అవధాని తప్పాడటగా. శామలీ భీమిలీ వంకాయ బజ్జీ, నీ వళ్లంతా గజ్జీ. యేబిసీడియఫ్. వాటీజ్ దిస్ వంకాయ్ పుల్స్, నీకేం తెల్స్, నిమ్మకాయ పుల్స్, అందరికీ తెల్స్, అన్నం సున్నం, పన్నం, కన్నం'' ఆగిపోయింది.

'' ఉన్మాదినేమో'' అన్నాడు బ్రహ్మానందం అరిశ తింటూ.

''చూశారా? మీరే గ్రహించారు వ్యాధిగ్రస్తురాలని. వ్యాధి పేరూ చెప్పేశారు'' అని నవ్వాడు శివానందం.

'' ఆంగ్లంలో హిస్టీరియా అంటారు దానిని. కొంతమందికి ఆ జబ్బు జన్మతః వుంటుంది. ధృతరాష్ట్రుడు పుట్టుగుడ్డి గదండీ. ఇదీ అంతే. చిన్నప్పుడు ముద్దుగా వుంటుంది. పెద్దయే కొద్దీ ముదిరి వికటిస్తుంది. నత్తి ఆపలేనట్టే దీనినీ ఆపుకోలేరు'' శివానందం లేచి వెళ్లి ఆఫ్ చేసి వచ్చాడు. చేతులూ మూతీ తుడుచుకున్నారిద్దరూ. శివానందం అన్నీ సద్ది గిన్నెలు పెరడులో వదిలి తలుపు మూసి వచ్చాడు. వక్కపొడి అందించాడు బ్రహ్మానందానికి.

''అమ్మాయి మంచి నిద్రబోతున్నది. పదండి. దింపి వస్తా బస్సు అందే వేళ. బస్ స్టాప్‌లో జనముంటారు''.

''మీ స్నేహితుడింకా వినోదమిచ్చేవి రికార్డు చేశాడా?''.

''చేశాడు. అదొక వినోదం. గోవింద నామాలు, పుష్కరాల వింతలు. అలా అంతా హాస్యమే. మరోసారి వినిపిస్తా''.